

ప్రజా న్యూస్

నెటవర్క్

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 155,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం , తేదీ :06-10-2026

మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల
మనసుల్లో భయం సృష్టించాలి



- దిల్లీలో అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు సీరియస్
- మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాలని పిలుపు

ఢిల్లి : మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా దిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని అభిప్రాయపడింది. దిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు,

ఆ మూడు డిమాండ్లపై రాజీపడే ప్రసక్తే లేదు
కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఎస్ఐఆర్‌ను రద్దు చేయాల్సిందేనన్న కాంగ్రెస్
- ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్



ఢిల్లి : ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మూడు అంశాలపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మరింత స్పష్టం చేసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ రద్దు, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించడం, ఆ మూడు డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. వీటిని పార్టీ రాజీ లేని డిమాండ్లుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ మూడు అంశాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయని ఖర్గే తెలిపారు.


ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..
సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని మిగతా..2లో

సన్న బియ్యం ధరలపై
హరీశ్ ఫైర్.. నాలుగు నెలల్లో
25 శాతం పెరిగాయంటూ విమర్శలు



తెలంగాణ రాష్ట్రంలో నిత్యావసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సామాన్యుడిపై పెను భారం పడుతోందన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 5: రాష్ట్రంలో నిత్యావసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ధరల పెరుగుదలతో సామాన్యుడిపై పెను భారం పడుతోందన్నారు. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని

రామప్పను కాపాడేందుకు
పెద్దఎత్తున ఉద్యమిస్తాం

- రామప్ప దేవాలయానికి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు ప్రతిపాదనపై మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- తవ్వకాలు, బ్లాస్టింగ్స్‌తో రామప్ప దేవాలయం, రామప్ప చెరువుకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.



హైదరాబాద్, అక్టోబరు 5 : సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు దోచుకోవడం అయిపోయిందని.. ఇప్పుడు భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని ధ్వజమత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు.

రామప్పకు తీవ్ర ముప్పు..

రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, మిగతా..2లో

భూ సమస్యల పరిష్కారానికి
ప్రాధాన్యత.. మంత్రి పొంగులేటి!

- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, భూ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.
- భూ వివాదాలు, హక్కుల నమోదు, రికార్డుల మార్పులు, భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు.



హైదరాబాద్: ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మిగతా..2లో

రాంబిల్లి సెజ్‌లో కొత్త విద్యుత్ ఉపకేంద్రం.. పరిశ్రమలకు మెరుగైన విద్యుత్ సరఫరా



అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి సెజ్ పరిధిలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు.

అనకాపల్లి జిల్లా, అక్టోబర్ 5: జిల్లాలోని రాంబిల్లి సెజ్ పరిధిలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ (సోమవారం) ప్రారంభించారు. అచ్యుతాపురం సెజ్ పరిధిలో కంపెనీలకు విద్యుత్తు అందించేందుకు ఈ 220/132//33 కె.వి విద్యుత్ ఉప కేంద్రాన్ని (గ్యాస్ ఇన్సులేటెడ్) నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన పరిశ్రమలకు అవకాశం కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు విద్యుత్ సబ్‌స్టేషన్లను అశ్రద్ధ చేసిందని విమర్శించారు. మిగతా..2లో

మీ టైమ్ పాస్ కోసం నా పేరు వాడుకోవద్దు.. నాకు పదవులపై వ్యామోహం లేదు



తన పేరును వాడుకుని ఇబ్బంది పెట్టొద్దని కోరిన బండ్ల గణేశ్
తనకు పదవులు, హోదాలపై ఎలాంటి ఆశ లేదని వెల్లడి
మీ టైమ్‌పాస్ కోసం నా జీవితంతో ఆడుకోవద్దంటూ విజ్ఞప్తి
చేతులెత్తి వేడుకుంటున్నానంటూ సోషల్ మీడియాలో పోస్ట్

హైదరాబాద్: ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరును అనవసర ప్రచారాలకు, చర్చలకు వాడుకోవద్దని, తన జీవితానికి అన్యాయం చేయొద్దని ఆయన చేతులెత్తి వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. తనకు ఎలాంటి పదవులపైనా, హోదాలపైనా ఆసక్తి లేదని బండ్ల గణేశ్ స్పష్టం చేశారు. "దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నాకు ఎలాంటి పదవుల మీద, మిగతా..2లో

2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా
సురక్షిత తాగునీరు

- వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్ 2.0
- అమరజీవి జలధార' పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు.
- జల జీవన్ మిషన్ 2.0- అమరజీవి జలధార పథకానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన



అమరావతి : గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తామని, ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్ 2.0- అమరజీవి జలధార' పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. మిగతా..2లో

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని,
అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య

- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ



అమరావతి: "యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

రామప్పను కాపాడేందుకు పెద్దఎత్తున ఉద్యమిస్తాం

బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని హెచ్చరించారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

ఆ మూడు డిమాండ్లపై

రాజీపడే ప్రసక్తే లేదు: కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై పోరాడుతున్న పౌర సమాజ సభ్యులు, యువజన సంఘాలకు కూడా కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు.

మూడు డిమాండ్లపై స్పష్టత

ఎక్స్‌లో ఖర్గే సోమవారం చేసిన పోస్టులో కాంగ్రెస్ డిమాండ్లను వరుసగా ప్రస్తావించారు. మొదటగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెండోది ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరారు. మూడోది ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆ మూడు అంశాలపై దేశవ్యాప్తంగా తమ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్యాలు ఉద్యమిస్తున్నాయని ఖర్గే చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఇదే అంశాలపై ఆందోళనలు చేస్తున్న పౌర సమాజం, యువజన సంఘాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని వెల్లడించారు.

ఎస్ఐఆర్‌పై కొనసాగుతున్న వివాదం

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కొంతకాలంగా రాజకీయంగా వివాదం కొనసాగుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఆ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్ల తొలగింపు, ఓటర్ల జాబితాల పరిశీలన, సంబంధిత వివరాలకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు కొన్ని నిర్ణయాలు, ఫైళ్ల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో వచ్చిన కథనం కూడా ఈ వివాదాన్ని మరింత పెంచింది. గత పది నెలల్లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ కథనం పేర్కొంది. అయితే ఆ అంశంపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. సంస్థలో నిర్ణయాలు తీసుకునే సమయంలో భిన్న అభిప్రాయాలు, సూచనలు రావడం సాధారణమేనని స్పష్టం చేసింది. అధికారుల మధ్య జరిగిన చర్చలను సంస్థాగత విభేదాలుగా చూడకూడదని తెలిపింది. ఎస్ఐఆర్ షెడ్యూల్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం పేర్కొంది.

దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

ఆ అంశాలపై ఇండియా కూటమి కూడా ఇప్పటికే ఉమ్మడి వైఖరిని ప్రకటించింది. సెప్టెంబర్ 30న న్యూదిల్లీలో జరిగిన కూటమి సమన్వయ సమావేశం తర్వాత ఖర్గే మూడు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో సేవ్ డెమోక్రసీ మార్చ్ నిర్వహించాలని కూటమి నిర్ణయించింది. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలను ప్రస్తావించనున్నట్లు ఖర్గే అప్పట్లో తెలిపారు.

దిల్లీలో ఆందోళన

అక్టోబర్ 3న దిల్లీలోని జంతర్‌మంతర్ సమీపంలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఏఐఎస్ఏతో పాటు మరికొన్ని సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటేందుకు కొందరు ప్రయత్నించారు. ఆందోళనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించినప్పటికీ వారు నిరసన కొనసాగించడంతో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ఘటన తర్వాత తమను పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కూడా ఖర్గే స్పందించారు. దిల్లీలో మహిళా జర్నలిస్టుల విషయంలో బీజేపీ వేధింపులకు పాల్పడిందని ఆరోపించారు. దీనిని ఖండిస్తున్నామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి

ప్రాధాన్యత.. మంత్రి పొంగులేటి!

నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, భూ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలు చిన్నచిన్న సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని అన్నారు. భూ వివాదాలు, హక్కుల నమోదు, రికార్డుల మార్పులు, భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు వేగంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల మంజూరు, నిర్మాణాల పురోగతిపై కూడా మంత్రి సమీక్షించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివిధ దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను గుర్తించి, సమస్యలను పరిష్కరించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలతో పాటు అవసరమైన చోట అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రతి శాఖ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా, కుమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ కె. హరిత, మంచిర్యాల అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఇతర జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాంబిల్లి సెజ్‌లో కొత్త విద్యుత్ ఉపకేంద్రం..

పరిశ్రమలకు మెరుగైన విద్యుత్ సరఫరా

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు పునరుద్ధరణ చేయడం జరిగిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఆర్ డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, కలెక్టర్ విజయ్ కృష్ణన్ హాజరయ్యారు.

మీ టైమ్ పాస్ కోసం నా పేరు వాడుకోవద్దు..

నాకు పదవులపై వ్యామోహం లేదు

హోదాల మీద, మరే విషయాల మీదా ఎలాంటి వ్యామోహం కానీ, ఆశ కానీ లేదు. లేనిపోని విషయాలు మాట్లాడి నా పేరును ఉపయోగించి నాకు ఇబ్బందులు కలిగించొద్దని మనస్ఫూర్తిగా రిక్వెస్ట్ చేస్తున్నాను" అని గణేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. బండ్ల గణేశ్ తాజా ట్వీట్ ఎవరిని ఉద్దేశించి చేసిందో స్పష్టత లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్.. నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయంటూ విమర్శలు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఉత్పత్తి పెరిగితే బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయని మాజీ మంత్రి ప్రశ్నించారు.

హరీశ్ రావు పోస్ట్..

'సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి .. రేవంత్ సర్కార్ నేల చూపులు చేస్తోంది. నిత్యవసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. సామాన్యుడిపై పెనుభారం పడుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉంది. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలి. నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణం. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారు. సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? రికార్డు స్థాయిలో



పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం... మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి.. బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయి?' అని ప్రశ్నించారు. 'మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలం అయితే, ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయి? మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటి? ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్ఎస్పీ(మీర్రా) పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధర. కానీ మధ్య దళారులకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000 పై మాటే. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం మధ్య దళారులు? కళ్లముందే ఈ తతంగం అంతా జరుగుతుంటే, ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదు? బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 ధరలు అడ్డగోలుగా పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలి? పంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా.. పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోంది? ధరల పర్యవేక్షణ గాలికి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సన్నబియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి, సామాన్యుడిపై పడుతున్న భారం నుంచి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు

మొదటి పేజీ తరువాయి

అనంతరం చంద్రబాబు మాట్లాడారు. 200 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి : "గోదావరి-కావేరి నదుల అనుసంధానం నా కోరిక. కరవు పరిస్థితుల్లో 200 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు. రానున్న రెండేళ్లలో రూ.30వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు తాగునీరు ఇస్తాం. గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. వైఎస్సార్సీపీ హయాంలో రోడ్లు గుంతలమయం అయ్యాయి. పాలనలో పవన్‌కల్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారు. కరవు పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించాం. రాయలసీమ దశ, దిశ మార్చిన ప్రభుత్వం ఎన్డీయే. ఈ ప్రాంతానికి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం. వైఎస్సార్సీపీ హయాంలో రాయలసీమకు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. వివేకా హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలి. మద్యం కుంభకోణంలోనూ అన్ని వేళ్లూ ఆయన వైపే చూపిస్తున్నాయి. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై జగన్ సమాధానం చెప్పాలి. ఉచిత ఇసుక ప్రజల హక్కు అక్రమాలు జరిగితే ఎవరినీ వదిలిపెట్టం" అని చంద్రబాబు హెచ్చరించారు. పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి : "పల్లెపండుగ 3.0తో రూ.11,085 కోట్లతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు. రోడ్ల, డ్రెయిన్లు, వీధిలైట్లు, పంటకుంటల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారానికి తీవ్రంగా కృషి చేస్తున్నాం. మదనపల్లెలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టాం. శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సహకారంతో 3 లక్షల ఇళ్లకు శ్రీకారం చుట్టాం. మరో 6 లక్షల ఇళ్ల నిర్మాణానికి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. రూ.30,156 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకు శ్రీకారం చుట్టాం. ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తాం, అందరి ఆశలు నెరవేరుస్తాం. ప్రతి వ్యక్తికి ఇంటి జాగా ఉండాలి, సొంత అడ్రస్ ఉండాలి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తాం. చదువు పూర్తికాగానే పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "కేంద్రంలో మోదీ సహకారం, పవన్ తపన, నా అనుభవంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం బుల్లెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. రాష్ట్ర పునర్ నిర్మాణానికి బలమైన



పునాదులు వేశాం. పేదవాడి సాధికారత, నాణ్యమైన జీవితం వంటి కార్యక్రమాలు చేపట్టాం. నాణ్యమైన మద్యాన్ని తక్కువ రేటుకే ఇస్తున్నాం. వాళ్లే నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై నెడతారు. నేను 2019లో ఉన్న ముఖ్యమంత్రిని కాదు, 4.0 వెర్షన్ ముఖ్యమంత్రిని. కుట్రలు, ఫేక్ ప్రచారాలే గొడ్డలి పార్టీ సిద్ధాంతం. నేరాలు చేయడం, ఇతరులపై నెట్టడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉంది. రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు చేయిస్తున్నారు. కడపకు ఏం చేశారో చెప్పే ధైర్యం వైఎస్సార్సీపీకి ఉందా? చెప్పండి.

2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!

మొదటి పేజీ తరువాయి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్



స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్న్‌షిప్‌లు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య

మొదటి పేజీ తరువాయి

రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం మునిగిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని



కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాలి: సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

మరింత పటిష్ఠమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించింది. దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్

శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి



ఉప్పల్ అక్టోబర్ 5 (ప్రజా న్యూస్ నెట్ వర్క్)
ఉప్పల్ నియోజకవర్గంలోని బీరప్పగడ్డ డివిజన్‌లో ఉన్న వైశ్య, బ్రాహ్మణుల శ్మశాన వాటికను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉప్పల్‌కు చెందిన వైశ్య, బ్రాహ్మణ సంఘాల నాయకులు మందుముల పరమేశ్వర్ రెడ్డిని కలిసి, బీరప్పగడ్డ డివిజన్‌లో ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, శ్మశాన వాటిక అభివృద్ధి అంశాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిక్కుమల అంజయ్య గుప్తా, బిక్కుమల అశోక్ గుప్తా, బిక్కుమల రమేష్ గుప్తా, మోత్కూరి అరవింద్ శర్మ, బిక్కుమల సుధాకర్ గుప్తా, పాలడుగు సంతోష్ గుప్తా, సముద్రాల నవీన్ గుప్తా, రేణిగుంట కిరణ్ గుప్తా, మా శెట్టి రాఘవేంద్ర గుప్తా, బిక్కుమల సంతోష్ గుప్తా, శ్రీధర్ గుప్తా, దాల్చా రాకేష్ గుప్తా, బిక్కుమల రాకేష్ గుప్తా, బిక్కుమల హరీష్ గుప్తా, ఉప శంకర్ గుప్తా, బిక్కుమల జగదీష్ గుప్తా, బిక్కుమల రవి గుప్తా, గౌరీశెట్టి శ్రీనివాస గుప్తా, రాజు గుప్తా, శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లోవ తలుపులమ్మ ఆలయంలో వరుణ యాగానికి ఏర్పాట్లు

సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు



తుని, అక్టోబర్ 5 ప్రజా న్యూస్ నెట్వర్క్:
లోవ తలుపులమ్మ ఆలయంలో వరుణ యాగానికి ఏర్పాట్లు లోవ గ్రామంలోని శ్రీ తలుపులమ్మ అమ్మవారి ఆలయంలో వరుణ యాగం, వరుణ జపం తదితర పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
దేశం, రాష్ట్రం, గ్రామాల్లో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు సిరిసంపదలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ రేపు (అక్టోబర్ 6) ఉదయం 6.45 గంటలకు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి, ధర్మకర్తల మండలి అధ్యక్షుల పర్యవేక్షణలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వేద పండితులు దేవతా మండపారాధనలు, అభిషేకం, హోమం, పూజాది కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ఆలయ సేవకులు, సిబ్బందితో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మిశ్రా జ్ఞానేశ్వర్‌ను తొలగించి.. తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి





(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ అక్టోబర్ 5
దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల నుంచి తొలగించిన అర్హులైన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి డిమాండ్ చేశారు.ఇండియా కూటమి ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న చిరంజీవి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. ఎలాంటి కారణాలతోనైనా అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించడం సరికాదని పేర్కొన్నారు.మిశ్రా జ్ఞానేశ్వర్‌ను తక్షణమే తొలగించాలని, ఓటరు జాబితాల నుంచి తొలగించిన అర్హులైన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు మూడు కోట్ల ఓట్లు తొలగించబడ్డాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన ప్రతి ఓటును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా కూటమి పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని చిరంజీవి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణి

ఉప్పల్ ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేత





ఉప్పల్ అక్టోబర్ 5:(ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :
ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి ల ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి గా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి విచ్చేసి ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పలువురు జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ బాండ్లను ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయంతో జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులకు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి సంక్షేమం, భద్రత కు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.
ఈ కార్యక్రమం లో గుడి మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు,నేర్థం భాస్కర్ గౌడ్, నాయకులు ఈరెల్లి రవీందర్ రెడ్డి,తిరుమలేష్,కొంపల్లి రవీందర్,పల్లె రాజకుమార్ గౌడ్,గడ్డం పాపి రెడ్డి,పిట్టల నరేష్,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్,ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

- బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



కుత్బుల్లాపూర్. అక్టోబర్.5.ప్రజా న్యూస్ నెట్వర్క్

మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటును నమోదు చేసుకోవాలని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఓటర్లకు పిలుపునిచ్చారు. సోమవారం నాడు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా వినిపించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు.. అందుకే అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు..

సంగారెడ్డి జిల్లా పి ఆర్ టి యు అధ్యక్షులుగా

మూడోసారి ఏకగ్రీవం.

ఆకుల మానెయ్య.





ప్రజా న్యూస్ అక్టోబర్ 05 అందోల్ ప్రతినిధి (మహమ్మద్ అభేద్)
ఆదివారం సంగారెడ్డి లోని జె ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ జరిగిన సర్వ సభ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు తులసి రామ్ రాథోడ్ విఠల్ రెడ్డి పోటీ పడగా ఎన్నికలు నిర్వహించారు. విఠల్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికలలో గెలిచారు. ఎన్నికల అధికారులుగా రామేశ్వర్ గౌడ్, ఆనంద్ రెడ్డిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి,మాజీ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టి వై జె ఎఫ్ నూతనగా ఎన్నికైన సభ్యులకు ఐడీ కార్డు పంపిణీ.



ప్రజా న్యూస్, అందోల్ ప్రతినిధి, 5, అక్టోబర్
సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల భాగయ్య.
టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ రావు తనువుల ఆదేశాల మేరకు టీ వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ సూచన మేరకు
టీ వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల భాగయ్య చేతుల కార్డు, హెల్త్ కార్డు, అపాయింట్మెంట్ లెటర్ టి వై జె ఎఫ్ అందోల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నాగరత్నం నియమించడం జరిగింది. అందోల్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు గా పి ప్రభు నియమించడం జరిగింది. సందర్భంగా నాగరత్నం , ప్రభు మాట్లాడుతూ మాపైన నమ్మకం ఉంచి మాకు పదవి కట్టబెట్టినందుకు టి వై జె ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ రావు తనుగుల, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, షేక్ మహబూబ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్, సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల భాగయ్య కి ప్రత్యేకమైన ధన్యవాదాలు అని తెలిపారు.

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలి

తొలగించిన అర్హుల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి

: అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, ఎండీ. అజీజ్ పాషా

(హుజూర్‌నగర్ మండలం) అక్టోబర్ 5, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రెటరీ ఎండీ. అజీజ్ పాషా డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తొలగించిన అర్హుల ఓట్లను వెంటనే జాబితాలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఏ అబ్దుల్ మజీద్ భాయ్, కోల మట్టయ్య, ఎస్‌కే బిక్కన్ సాహెబ్, పోతబోయిన రామ్మూర్తి, లచ్చిమల్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త దుంగ దేవన్ రాజు చేతుల మీదుగా ఘనంగా శ్రీ శ్రీ శ్రీ జయ దుర్గ అమ్మవారి పోస్టర్ విడుదల..



విశాఖపట్నం, అక్టోబర్ 05 : ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.

పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ జయ దుర్గ అమ్మవారి పోస్టర్ను ఆదివారం సాయంత్రం దేవాలయం వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆంధ్రప్రదేశ్, శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (జింక్ గాజువాక), ఆలయ ధర్మకర్త, జనసేన పార్టీ , 61వ వార్డు అధ్యక్షులు దుంగ దేవన్ రాజు చేతుల మీదుగా ఘనంగా నవరాత్రుల పోస్టర్ను విడుదల చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అమ్మవారి నవరాత్రుల మహోత్సవం అంగరంగ వైభంగా నిర్వహిస్తారు. ఈనెల 11 నుంచి నవరాత్రి ప్రారంభమవుతాయి అని తెలిపారు. అక్టోబర్ 15 అమ్మ వారి పడి పూజ ఎన్నడూ లేని విధంగా ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సన్నాహాలు చేస్తుంది. దేవన్ రాజు మాట్లాడుతూ.. ఈ పోస్టర్ విడుదల అవకాశం ఇచ్చిన ఆలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ.. నవరాత్రులు ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీని కోరారు. అక్టోబర్ 6న వరుణ యాగం కార్యక్రమం శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (జింక్)లో ఉదయం 7 గంటలకి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తల్లి దీవెన అందరిపై ఉండాలని ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో జీవించాలని తల్లిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు భోగవిల్లి వెంకట్రావు, వర్మ, కోలాటం పిల్లలు,మహిళలు భక్తులు భవానీలు తదితరులు పాల్గొన్నారు.

రూప్లతండాలో భగ్గుమన్న పాత కక్షలు

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ.. 8 మందికి గాయాలు





(త్రిపురారం మండలం) అక్టోబర్ 5, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :
నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం రూప్లతండా గ్రామపంచాయతీ పరిధిలోని కూన్యతండాలో పాత వివాదం ఘర్షణకు దారితీసింది. ధనావత్ వెంకట్రామ్, ధనావత్ కృష్ణ కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మందికి గాయాలైనట్లు సమాచారం. గమ్మ, చింటూ, శివ, బాల సహా పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

సోమవరం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా సన్నబియ్యం పంపిణీ: కొనతం చిన్న వెంకటరెడ్డి



(నేరేడుచర్ల మండలం) అక్టోబర్ 5, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :నేరేడుచర్ల మండలం సోమవరం గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. పేద కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం అందించడం అభినందనీయమన్నారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రహీమ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పెదపంగ ప్రవీణ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కలీం భాయ్, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు

ప్రజా న్యూస్ అక్టోబర్ 05 (అందోల్ ప్రతినిధి ఎండి అభేద్)
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు చెందిన యాదుల్ నీ యాక్సిడెంట్స్ అయినదని తెలియగానే నా కార్యకర్త ఆపదలో ఉన్నాడని తెలుసుకొని వెంటనే వారి స్వగృహం కి వెళ్లి పరామర్శించాడు. అధర్య పడొద్దు అండగా నేనున్నా అని యాదుల్ కీ ధైర్యం చెప్పాడు. నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు అపద్బాంధవుడులా మీ వెంటే ఉంటానని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)అన్నారు.



త్రిపురారంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కైలాష్‌నేత



(త్రిపురారం మండలం) అక్టోబర్ 5, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :
త్రిపురారం మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాష్‌నేత, మండల పార్టీ అధ్యక్షుడు ఆలంపల్లి జానయ్య కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉమ్మడి చెర్లపల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

– మారుతి ఎంక్లేవ్‌లో రూ.22 లక్షలతో పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

– నాగార్జున నగర్ రోడ్ పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





ఉప్పల్ అక్టోబర్ 5: (ప్రజా న్యూస్ నెట్ వర్క్)
ఉమ్మడి చెర్లపల్లి డివిజన్ పరిధిలోని మారుతి ఎంక్లేవ్‌లో స్థానిక ప్రజల సౌకర్యార్థం రూ.22 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు, చిన్నారులు, వృద్ధులు మరియు స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్‌ను అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం నాగార్జున నగర్ లో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.
స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ గ్యాస్ దుర్వాసనతో ప్రజలు అవస్థలు



ఎల్కతుర్తి, అక్టోబర్ 5 ప్రజా న్యూస్ నెట్వర్క్: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న రిలయన్స్ గ్యాస్ ప్లాంట్ ప్రాంతం నుంచి విపరీతమైన దుర్వాసన వెలువడుతుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం సూరారం గ్రామానికి చెందిన ప్రజలు ఎల్కతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గ్యాస్ దుర్వాసన కారణంగా ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, దగ్గు, తుమ్ములు, ఆయాసం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళల్లో దుర్వాసన మరింత తీవ్రంగా ఉండటంతో ఇళ్లలో ప్రశాంతంగా నిద్రపోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.దుర్వాసన తీవ్రత కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దుర్వాసనకు అసలు కారణాలను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైతే దుర్వాసనకు కారణమవుతున్న కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, సమస్యను పూర్తిగా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.
రిలయన్స్ గ్యాస్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న వాయువులపై కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి, నిబంధనలను పాటిస్తున్నారో లేదో పరిశీలించాలని కోరారు.గ్యాస్ ప్లాంట్ యాజమాన్యం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా, పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని గ్రామస్తులు సూచించారు. ఎల్కతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి లో సమర్పించిన వినతిపత్రంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రైతులు యూత్ తదితరులు పాల్గొన్నారు

ఆత్మకూర్‌లో మాదిగ మాన్యాలపై
ఆక్రమణలు ఆపాలి

– కొప్పాల రఘు

– ఆక్రమ లేఔట్లను రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకోవాలి

ఆత్మకూరు అక్టోబర్ 5ప్రజాన్యూస్ నెట్ వర్క్ : ఆత్మకూరు ఆ ప్రాంతంలో మాదిగలకు సంబంధించిన మాదిగ మాన్యాల భూములపై జరుగుతున్న ఆక్రమణలను తక్షణమే అడ్డుకోవాలని ఎఎఎ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగల హక్కులకు సంబంధించిన భూముల్లో అనధికారికంగా చేపడుతున్న లేఔట్లను వెంటనే పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని రద్దు చేయాలని కోరారు.మాదిగలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు ఆక్రమణలకు గురైన మాదిగ మాన్యాలు భూములను ప్రభుత్వం గుర్తించి స్వాధీనం చేసుకుని, అర్హులైన మాదిగ కుటుంబాలకు తిరిగి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారుఅధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి భూముల విషయంలో పేదలు, బలహీన వర్గాలకు అన్యాయం జరగకుండా రెవెన్యూ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కొప్పాల రఘు కోరారు. భూముల రికార్డులను పరిశీలించి, అక్రమ లేఔట్లకు అనుమతులు ఎలా వచ్చాయనే అంశంపైనా విచారణ జరపాలని అన్నారుకులాల వృత్తిపరంగా మాదికులకు కేటాయించబడి ఉన్న మాదిగ మాన్యాలు భూములపై ఆక్రమణలను సహించేది లేదు భూముల రక్షణ కోసం ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తాం ప్రభుత్వం వెంటనే స్పందించి మాదిగలకు న్యాయం చేయాలని కొప్పాల రఘు స్పష్టం చేశారు.



గుర్రంపోడ్ మండల కేంద్రంలోని తాహసిల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు జైవీర్ రెడ్డి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.



సెప్టెంబర్:5(ప్రజా న్యూస్ రిపోర్టర్ దోటి. శ్రీను)

ఈ సందర్భంగా పిట్టలగూడెం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మారెడ్డి యాదగిరి రెడ్డి, పిట్టలగూడెం గ్రామ ఉపసర్పంచ్ మారపాక అంబెడ్కర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ కట్ట నరసింహ, నాయకులు పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మీ టైమ్ పాస్ కోసం
నా పేరు వాడుకోవద్దు..
నాకు పదవులపై వ్యామోహం లేదు : బండ్ల గణేశ్



ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరును అనవసర ప్రచారాలకు, చర్చలకు వాడుకోవద్దని, తన జీవితానికి అన్యాయం చేయొద్దని ఆయన చేతులెత్తి వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది.తనకు ఎలాంటి పదవులపైనా, హోదాలపైనా ఆసక్తి లేదని బండ్ల గణేశ్ స్పష్టం చేశారు. “దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నాకు ఎలాంటి పదవుల మీద, హోదాల మీద, మరే విషయాల మీదా ఎలాంటి వ్యామోహం కానీ, ఆశ కానీ లేదు. లేనిపోని విషయాలు మాట్లాడి నా పేరును ఉపయోగించి నాకు ఇబ్బందులు కలిగించొద్దని మనస్ఫూర్తిగా రిక్వెస్ట్ చేస్తున్నాను“ అని గణేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.బండ్ల గణేశ్ తాజా ట్వీట్ ఎవరిని ఉద్దేశించి చేసిందో స్పష్టత లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

నవంబర్ చివరికల్లా రైతులకు హెచ్ఎండీఏ ప్లాట్లు



(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ అక్టోబర్ 5

ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లే అవుట్లపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమక్షంలో హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు సంవత్సరాలుగా ప్లాట్లు కేటాయించకపోవడంపై జగ్గారెడ్డి, నిర్మల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరుట్లలో 106 ఎకరాల 14 గుంటల లే అవుట్ ప్రక్రియ పూర్తయిందని, ఫసల్‌వాదిలో భూసేకరణ 60 శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. కందిలో 46 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని, లే అవుట్ పనులు వేగంగా పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు.

నవంబర్ చివరికల్లా ఆరుట్ల, ఫసల్‌వాది, కంది లే అవుట్లలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు కేటాయించాలని జగ్గారెడ్డి కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక
శాశ్వతంగా వన్‌వే
: జీహెచ్ఎంసీ కమిషనర్



హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది.సోమవారం కేబీఆర్ పార్క్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్‌ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై
ప్రధాని మోదీ పేరిట పూజలు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు.
2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం.ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..
ప్రత్యేక పాలసీకి తెలంగాణ
సర్కార్ ప్లాన్



తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు. విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

2029 నాటికి 4-స్టార్..
ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష..
అధికారులకు కీలక ఆదేశాలు!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.
ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కారుమూరిని హైదరాబాద్ జైలు నుంచి విజయవాడ తరలింపు



ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు.విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు.ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది.ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.